

శేషేంద్ర

# కాల రేఖ

## ఈ శతాబ్ది చింతన

### తులనాత్మక సాహిత్య వ్యాసాలు



Seshendra's mother Ammayamma (sitting)
with (from left) her youngest daughter Devasena, daughter-in-law
(Seshendra's wife) Janaki, son Seshendra, Husband Subrahmanyam,
Youngest son Rajasekharam and elder daughter Anasuya in 1949
at Seshendra's house at Thotapalli Gudur Village, Nellore District,
Pin-524 311, A.P, India.

# కాలరేఖ

ఈ శతాబ్దిచింతన

తులనాత్మక సాహిత్య వ్యాసాలు

**THE ARC OF TIME**
(This Century's thinking)
Essays in comparative Literature

***Seshendra Sharma***

Price : Rs. 100/-

Published : 20th October, 2009

© **G. Satyaki**
S/o G. Seshendra Sharma

1st Edition : 1990

2nd Edition : 2009

3rd Edtion : 30th May, 2022

© Saatyaki S/o. Seshendra Sharma
saatyaki@gmail.com
+91 7702964402, 8919794634

Price : 135/-

Available :
At All Leading Book Shops
in Telanga State & Andhra Pradesh

Printed at :
**Sai Likhita Printers**
Khairatabad, Hyderabad - 500 004

# విషయ సూచి

1. శేషేంద్ర జీవన రేఖ ............................................................ 6
2. అంతులేని విద్వత్తూ అంటరాని విద్యుత్తూ........................................ 12
3. శేషేంద్ర రచనలు ............................................................ 28

కాలరేఖ....

1. వాల్మీకి కవిత ............................................................ 30
2. మేఘ సందేశము............................................................ 37
3. అరవింద సావిత్రి............................................................ 41
4. వ్యాసుడెవరు? ............................................................ 67
5. తులనాత్మక సాహిత్యము............................................................ 77
6. ప్రాచీన గ్రీకు ప్రాచీన భారతీయ నాటకాల తులనాత్మక పరిశీలన .............. 89
7. శాకుంతలం నాందీ శ్లోకము దేవీ స్తోత్రమే.................................... 100
8. విక్రమోర్వశీయం ............................................................ 110
9. ఇద్దరు ఋషులు ఒక కవి ............................................................ 115
10. సూర్యశతకము : ఒక అధ్యయనము ................................................ 125
11. విప్లవ కవిత్వము : సాహిత్యవిమర్శ................................................ 133
12. గజల్ ఒక అయస్కాంత విద్య ................................................ 141
13. గజల్ ఒక అగ్ని............................................................ 144
14. గజల్ ఒక సంస్కృతి ............................................................ 147
15. గజల్ అందము ఛందము............................................................ 150
16. ప్రాచీన ప్రపంచంలో గజల్ ................................................ 157
17. కవిత్వముః అవగాహన ............................................................ 161
18. ఛందస్సు : కవిత్వ ఆయుస్సు ................................................ 162
19. వచన కవిత : ఒక ప్రపంచ పర్యవేక్షణ ................................................ 165
20. రాయప్రోలు ఆంధ్రకవిత్వ విద్యకు ఆద్యుడు........................................ 169
21. తిరుపతి వేంకటకవులు ............................................................ 175
22. గురుజాడ అప్పారావు ............................................................ 177
23. పానుగంటి లక్ష్మీనరసింహారావు ................................................ 179
24. ధర్మవరం రామకృష్ణమాచార్యులు ................................................ 181
25. చిలకమర్తి లక్ష్మీనరసింహం ................................................ 183

# అంతులేని విద్వత్తూ అంటరాని విద్యుత్తూ
## గుంటూరు శేషేంద్రశర్మ

– డా॥ అద్దంకి శ్రీనివాస్
ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు
1521, క్యాలిఫోర్నియా సర్కిల్,
Milpitas | CA | 95035

గుంటూరు శేషేంద్రశర్మ విద్వత్కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి. భాషాపరశేషభోగి.

కవిత్వానికి పరుసవేది, విమర్శలో కుండలిని.

తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, ఫ్రెంచి, జర్మన్ భాషలలో పాండిత్యం ఆయన వ్యుత్పత్తి. పాట, పద్యం, కవిత, వ్యాసం ఏది రాసినా.. అందులో శేషేంద్ర ముద్ర తప్పకుండా ఉంటుంది.

తిక్కన భీముడిని వర్ణిస్తూ తన అఖండబాహాబలగర్వము యచ్చట ముంగలిగా మదమత్త భద్రగజసదృశగతిన్ అంటాడు (విరా.అవి.326). అలాగే శేషేంద్రగారి రచనలకు ముందు ఆయనలోని అఖండశేముషీ ధురీణత నడుస్తుంది. అది ప్రసన్నం కానిదే శేషేంద్ర అర్థం కాదు. కవిగా, విమర్శకుడిగా, పండితుడిగా శేషేంద్రను అంచనావేయటం అంత సులభం కాదు.

ప్రపంచ సాహిత్య ధోరణులకు తగినట్లుగా తన ఆలోచనాదృక్పథాన్ని విస్తరించుకొని, నూతన కవితావాహికను చేపట్టి కవితారంగంలో విశ్వజనీనప్రవృత్తిని ప్రకటించి నూతన శకాన్ని ఆరంభించిన కవి శేషేంద్ర. విమర్శకుడిగా సాహిత్యపు లోతుల్ని ఆవిష్కరింపజేసి ఆలోచనకు తాత్త్వికత అద్దిన సద్విమర్శకుడు.

ఆధునిక సాహిత్యంలో ఆంగ్లాంధ్రభాషాపరిచయాలవల్ల గొప్ప విమర్శకులు కావడం ఈ యుగ విశిష్టత. దార్శనికుడైన కవికి ప్రక్రియలన్నీ కరతలామలకంగానే ఉంటాయి. కందుకూరి వీరేశలింగం యుగం నుంచి రచయిత అనేక ప్రక్రియల్లో ప్రవేశించే పద్ధతి ఒక సంప్రదాయంగా వస్తూనే ఉంది. ఈ కోవలోకి వచ్చే విశిష్టకవి విమర్శకులు శేషేంద్రశర్మ.

విశ్వనాథ, శ్రీశ్రీలలోని కొన్ని అంశల్ని పుణికి పుచ్చుకొన్న శేషేంద్రకి పాశ్చాత్య సాహిత్యదృక్పథం శరీరం. భారతీయ అలంకారశాస్త్రం ఆత్మ. సాధారణంగా కవిత్వానికి వ్యాఖ్యానం కావాలి. విమర్శవ్యాసాలకు అవసరం ఉండదు. కానీ శేషేంద్ర విషయంలో ఇది వ్యతిరిక్తం.

### కవిత్వానికి పరుసవేది

'పరుసవేది సోఁకుటయును బరుషలోహ, మధికశుద్ధసువర్ణమయైన పోల్కి' అని

# వాల్మీకి కవిత

నదులు కవులు భూగోళపు రక్తనాళాలు
నదులు ప్రవహిస్తాయి కవితల్లా
పశువుల కోసం పక్షుల కోసం మనుష్యుల కోసం
నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి
కవులు కంటున్న కలలు మనుష్యుల్లో ఫలిస్తాయి....

**(ఆధునిక మహాభారతము)**

మనమందరమూ ఈ దేశంలో కవుల కలలం. కవులకు మూలపురుషుడు వాల్మీకి. ఆయన కావ్యం రామాయణం నుంచి వ్యాసుడి భారతం పుట్టింది. రామాయణ భారతాల నుంచి భాసకాళిదాసాదులు పుట్టారు. ఇది ఈ దేశపు కవుల వంశ వృక్షం. ఆ వృక్షచ్ఛాయల్లో మనం పుట్టి పెరిగి మన పరమార్థం చేరుకుంటున్నాము. తల్లిదండ్రుల ఛాయను బిడ్డలు ఎరుగరు. వాళ్ళ బిడ్డలకు వాళ్ళు ఛాయ ఇస్తున్న సంగతి తల్లిదండ్రులకే తెలుసు. ఇది సృష్టి వైఖరి!

వాల్మీకి నదుల్లో గంగానది, పర్వతాల్లో హిమాలయం, అరణ్యాల్లో నైమిశారణ్యం. వికసించే కవి యౌవన కవిత్వదశ నుంచి జీవన కవిత్వదశ చేరుతాడు. అప్పుడు అతని జీవన బోధ పరాకాష్ఠ చేరుతుంది. ప్రథమ దశలో కవికి జీవితం తామర పూలు అలంకరించిన సరస్సులా ఉంటుంది. రెండవ దశలో రౌద్రమయిన సముద్రంలా ఉంటుంది. మూడవ దశలో ఒక విశాల విశ్వ దృశ్యంగా మారుతుంది. ఈ తృతీయ దశలో తత్త్వాలాలస అలముకున్న కళ్ళు తపోవనాల్లోకి పరుగులిడుతాయి! జీవితంలో అర్థాంతరాలు వెతుకుతాయి. వస్తువుల్లో సముద్రాలు సాక్షాత్కరిస్తాయి. అంతా ఒక అద్భుతదర్శనం!

అందుచేతనే అరణ్యాల్లోపడి పరుగులెత్తే నదిని చూచి ఈ దశ చేరిన వాల్మీకి అంటాడు "నదీం పుష్పోడుప వహాం" పువ్వులనే పడవల్ని మోసుకుపోతున్న నది. గట్ల మీద చెట్లు రాల్చిన పువ్వులు నదీ జలాల్లో తేలుతూ పోవడం కాదు; నదులే రంగు రంగుల పువ్వుల్ని మోసుకుపోతున్నాయి. మొదటిదే అయితే రమణీయ దృశ్యం మాత్రమే; చర్మ చక్షువులకు కనిపించేది, ఇంద్రియాల్ని ఉపలాలించేది. నది పువ్వుల్ని మోసుకుపోవడమనే దృశ్యం అలాకాదు. వాగ్ధేనువు పొదుగు నుంచి మనస్సు మాధుర్యం ధారలు అనంతంగా పిండుకునే దృశ్యం.

ఇంటి కప్పును మోస్తున్న స్తంభాల్ని చూచి షోఫెన్ హోవర్ అనే తత్వవేత్త అంటాడు, "ఇంటి కప్పును భూమ్యాకర్షణ శక్తి కిందికి లాగుతుంటే దాన్ని పడనీకుండ నిలపాలని భూమ్యాకర్షణశక్తితో ఆ స్తంభాలు నిరంతరం పోరాడుతున్నాయి" అని! ఈ దృష్టి ఉత్పన్నం కావడమే కవి జన్మ ఎత్తడం.

# మేఘ సందేశము

మేఘసందేశం ఒక కావ్యం కాదు!
కుమారావస్థలో దాన్ని చదువుకున్న వాళ్ళకు
అది జీవితాంతం వెంటాడే ఒక బలీయ స్మృతి!

సంధ్యాకాలపు స్వాతి కొంగలు, మేఘపు శ్లోకాలు, నన్ను బాల్య స్మృతుల్లోకి మోసుకు పోతాయి నౌకల్లా. మేఘ సందేశం అనగానే మేఘాలు, గ్రామాలు, పొలాలు, తడినేలలు, పచ్చి గడ్డి వాసనలు, పశువుల మందులు, ఇంద్రధనుస్సు ముక్కలు, ఇలాటివేవో జ్ఞాపకాలు ముసురుకు వస్తాయి.

అందులోనూ ఒంటరితనం హృదయతంత్రికి తగిలితే, జ్ఞాపకాలశాఖ ఊగిసలాడి ఎన్ని ఆకులు రాలుతాయో జల్లులు జల్లులుగా!

కావ్యంగా మేఘసందేశం ఒక అద్వితీయ కావ్యం అనుకోను; ఆమాట వాల్మీకి రామాయణాన్ని గురించి నిశ్శంకగా చెప్పగలను. అలాగే సృష్టిలో వర్షం ఒక అద్వితీయ వస్తువు అనుకోను; కానీ వర్షం సస్యాలకు జనయిత్రి, జీవకోట్లకు ప్రాణదాత్రి,

మామూలుగా మనం ఉత్కృష్టకావ్యాలనే రచనల్లో అనుభవించే కావ్యత, శైలి, భాష, ఇత్యాది అసామాన్య ద్రవ్య విశేషాలనన్నిటిని అతిక్రమించి ఏదో ఒక అనిర్వచనీయమైన ప్రాకృతికశక్తి - పోలేరమ్మ మైలారమ్మ - లాంటిది, ఏదో గ్రామశక్తి లేక గ్రామీణశక్తి, సాహిత్యపీఠమెక్కి హృదయ అధిష్ఠాత్రిగా కూర్చుని ఉంటుంది. మేఘసందేశ శ్లోకం, ఒక ఆలయం ఆ శక్తికి! ఆ శక్తి గ్రామీణత ఉన్న పరితల్ని పాలిస్తుంది; లాలిస్తుంది; మృదులం చేసి, దూది పింజల్ని చేసి, విసిరేస్తుంది దూరదూర బాల్య తీరాలకు. ఇంత బలాత్కార శక్తి ఉన్న కావ్యం మరొకటి ఏది అని మనం వెతుక్కోవాలి.

ఏది వృద్ధుల్నీ ప్రౌఢుల్నీ కూడా కుమారుల్నీ బాలుర్ని చేసి వయః ప్రవాహాన్ని వెనక్కి మళ్ళిస్తుందో, ఏది మృత్యుబోధవైపు ప్రవహించే మనిషికి ఆనకట్ట కడుతుందో, ఆ ఆశ్చర్యజనకమైన కావ్యం మేఘసందేశం. ఇది ఈకావ్య ప్రయోజనం.

1. ఆషాఢస్య ప్రథమదివసే మేఘ మాశ్లిష్టసానుం — 1-1
   వప్రక్రీడా పరిణత గజ ప్రేక్షణీయం దదర్శ

2. మేఘాలోకే భవతి సుఖినోప్యన్యథా వృత్తిచేతః — 1-3
   (పర్యుత్సుకోభవతి)

3. త్యామారూఢం పవన పదవీ ముద్గృహీతాలకాంతాః — 1-8
   ప్రేక్షిష్యంతే పథికవనితాః

# అరవింద సావిత్రి

కావ్యం దృశ్య వస్తువుల్లో అదృశ్యవస్తువుల్ని చూచే నేత్ర విద్య. కావ్య నిర్మాణంలో మూలద్రవ్యాలైన అలంకారాలు, ప్రతీకలు, బింబాలు, అలాంటి అదృశ్య వస్తువులే– దీపకాంతి లోనే కాదు సూర్యకాంతిలో కూడా అవి కనుపించేవి కావు. సామాన్యతః కావ్యం ఈ విధంగా దృశ్యవస్తువులో అదృశ్యవస్తువుల్ని చూడడం అయితే అరవిందుడి కావ్యం అదృశ్యవస్తువుల్ని దృశ్యమానం చేసే ప్రక్రియ.

వాల్మీకి వ్యాసులు దృశ్యవస్తువు అయిన మానవుడి భౌతిక జీవనయాత్రను గురించి కావ్యాలు నిర్మిస్తే అరవిందుడు ప్రధానంగా మానవుడి మరణానంతర జీవనాన్ని గురించి అంటే మానవుడి అభౌతిక జీవయాత్రను గురించి కావ్యనిర్మాణం చేశాడు. అంటే ఆయన ఇతివృత్తం అదృశ్యవస్తు ప్రధానం. ఐతిహాసికులైన వ్యాస వాల్మీకుల్లో ఆధ్యాత్మిక సంబంధమైన మిథకీయ సృష్టి కొంత ఉన్నప్పటికీ దానికంటే వారిలో ప్రధానం మానవుడు భూగోళం మీద చేసిన జీవయాత్ర. ఈ ఉభయుల్లోనూ మరణానంతర జీవనవృత్తం ఇతిహాసపు చరమభాగంలో స్పృశింపబడుతుంది–అది ప్రధానవృత్తం కాదు. ఈ విషయం గుర్తించడం ముఖ్యం. కనకనే సావిత్రి వ్యాసుడిలో ఉపాఖ్యానం, అఖ్యానం కాదు. వ్యాసుడి ఉపాఖ్యానం అరవిందుడిలో ఆఖ్యానంగా వికసించింది. అందుచేతనే అరవిందుడి కావ్యసృష్టి అదృశ్యవస్తువుని దృశ్యమానం చేయడం అనే విచిత్ర ప్రక్రియ.

భౌతిక జీవయాత్ర పొడిగింపే మరణానంతరం జీవయాత్ర లేక అభౌతిక జీవయాత్ర. అవి లౌకిక జీవయాత్రలని సంజ్ఞితమైతే సుగమంగా ఉంటుంది. ఒకటి కనిపిస్తుంది. మరొకటి కనిపించదు. లౌకిక అలౌకిక జీవయాత్ర నుంచి అలౌకిక జీవయాత్రలోకి ప్రవేశించేటప్పుడు జీవుడు తన పార్థివశరీరాన్ని, వేదాంతభాషల్లో స్థూల శరీరాన్ని, పరిత్యజించి సూక్ష్మ శరీరంతో ప్రయాణం చేస్తాడని తత్త్వజ్ఞులు చెప్పారు. (నేను చూడలేదు) లౌకిక జీవయాత్ర గురించి చెప్పడానికి గానీ తెలుసుకోడానికి గానీ ఎట్లా అనుభవమే తప్ప గ్రంథం ఉపయోగించదో అట్లాగే అలౌకిక జీవయాత్ర గురించి తెలుసుకోడానికి చెప్పడానికి అనుభవమే ప్రధానం అని వేరే చెప్పనక్కరలేదు. వేదోపనిషదాది గ్రంథాలు అనుభవమున్న వాళ్ళు చెప్పిన రికార్డులు కావచ్చు. కానీ లౌకిక జీవయాత్ర గురించి చెప్పే గ్రంథాన్ని అలా మనం మన అనుభవం చేత పరీక్షించవచ్చును. కానీ అలౌకిక జీవయాత్ర గురించి చెప్పే గ్రంథాన్ని అలా మనం మన అనుభవం చేత పరీక్షించలేము. పార్థివోత్తర జీవయాత్రను గురించి యోగులు యోగసాధన చేత తెలుసుకుంటారని చెపుతారు. ఈ మాట చింతన చేతనే గ్రహణీయం కానీ తర్కం చేతకాదు.

అనుభవాన్ని ఆటోబయోగ్రఫీ కూడా చెపుతుంది. కానీ కవిత్వం దాన్ని రమణీయంగా చెపుతుంది. మనస్సు అనురంజితమై అందులో లగ్నమయ్యేలా చెపుతుంది. ఆటోబయోగ్రఫీ

# వ్యాసుడెవరు?

సముద్రంలో కలిసిపోయిన వాడ్నయినా పట్టుకోవచ్చుగానీ కాలంలో కలిసిపోయినవాడ్ని పట్టుకోవడం అసాధ్యం. వాల్మీకి వ్యాసులు అలాంటివారు. వాల్మీకి అన్న పేరు అసలు పేరు కాదు. సంస్కృత సాహిత్యంలో ఏ కవి పేరూ అసలు పేరుగాదు. మనకు తెలిసిన సంస్కృత కవుల పేర్లన్నీ ఉర్దూ గజల్లో తఖల్లుస్ లాంటివే. వాల్మీకి అసలు పేరు రత్నాకరుడట! నిజమో కాదో రుజువు లేదు. ఆయనకే భార్గవుడనే పేరు మరొకటుంది. అలాగే ప్రచేతసుడు అని కూడా. ప్రచేతసుడికి ఆయన పదవతరం వాడట. ప్రచేతసుడు వరుణుడు. మరి తైత్తిరీయంలో భృగువల్లి శిక్షావల్లి ఆనందవల్లి నేర్చుకున్న వరుణ పుత్రుడు వారుణి వాల్మీకియేనా? అసలు భార్గవ ప్రాచేతసాది నామధేయాలు అతనివేనా లేక భిన్న భిన్న వ్యక్తులవా? ఈ తర్జన రాక తప్పదు. భిన్న భిన్న వ్యక్తులైతే రామాయణ కర్త వాల్మీకియేనా? రామాయణ బాలకాండలోనూ ఉత్తరకాండలోనూ రామాయాణ కర్త వాల్మీకి అనే ఉంది. అయితే అవి ప్రక్షిప్త భాగాలని పండితుల అభిప్రాయం. అది సమంజసం కూడా. పైగా రామాయాణంలోనే (అయో – 56స) సీతారామ లక్ష్మణులు చిత్రకూట పర్వతం చేరినప్పుడు అక్కడ వాల్మీకి ఆశ్రమం వెళ్లి వాల్మీకి మహర్షికి అభివాదం చేసినట్లు మాత్రమే చెప్పబడింది. "ఇతి సీతాచ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః। అభిగమ్యాశ్రమం సర్వే వాల్మీకి మభివాదయన్॥" (16 శ్లో) "తాన్ మహర్షిః ప్రముదితః పూజయామాస ధర్మవిత్ ఆస్యతామితిచోవాచ స్వాగతం తం నివేద్యచ" (17శ్లో) ఇంతే– ఈ రెండూ శ్లోకాలే ఉన్నాయి అప్రక్షిప్తమూలగ్రంథంలో! కనక ఆ వాల్మీకే ఈ రాయాయణం రాశాడనడానికి రామాయణంలో సాక్ష్యం లేదు. భారతంలో కూడా వాల్మీకి పేరు వస్తుందేగానీ రామాయణ కర్తగా పేర్కొనబడలేదు. జనశ్రుతి మాత్రమే ఉంది. జనశ్రుతి కాలగర్భాన్ని మరింత గంభీరం చేస్తుందేగానీ కాలంలో కలిసిపోయిన వాడ్ని బయటికి తీయడానికి సహాయం చేయదు.

వ్యాసుడు ఇంతకంటే క్లిష్టం. జయం రాసిన వ్యాసుడా? భారతం రాసిన వ్యాసుడా? మహాభారతం రాసిన వ్యాసుడా? వేదవిభజన చేసిన వ్యాసుడా? బ్రహ్మ సూత్రాలు రాసిన వ్యాసుడా? పురాణాలు రాసిన వ్యాసుడా? పతంజలి యోగ సూత్రాలకు భాష్యం రాసిన వ్యాసుడా? (ఈ భాష్యానికి 'తత్త్వవైశారది' అనే వ్యాఖ్యానం వాచస్పతి అనే ఆయన రాసాడు) బృహస్పతి, నారద, కాత్యాయనాది స్మృతి కర్తల్లో ఒకడై వ్యాసస్మృతి రాసిన వ్యాసుడా? ఏ వ్యాసుడు! వీరందరూ ఒకే వ్యాసుడా లేక భిన్న భిన్న కాలాలకు చెందిన వ్యాసులా? మహాభారత బ్రహ్మసూత్ర అష్టాదశ పురాణాలు రాసిన వ్యాసుడు ఒక్కడే అని సంప్రదాయం. అదే వివాదగ్రస్తమై ఉండగా ఈ దేశంలో ఎక్కడ వ్యాసుడు అని వచ్చినా అతడు ఆ ఒక్క వ్యాసుడే అనే విశ్వాసం ఉంది. కానీ ఈ విశ్వాసాన్ని అతిక్రమించి కాలంలో కలిసిపోయిన వ్యాసుడినో వ్యాసులనో బయటికి తీయడం ఒక దుర్ఘటమైన కార్యం. ఈ కార్యం చేసిన కీర్తి ఏ వ్యాసుడికి

# తులనాత్మక సాహిత్యము

(ఆంధ్ర విశ్వ విద్యాలయం "తులనాత్మక సాహిత్యగోష్ఠి" లో శేషేంద్ర ప్రధానోపన్యాసము - తేది. 20-10-1986)

"నదులు కవులు భూగోళపు రక్తనాళాలు। నదులు ప్రవహిస్తాయి కవితల్లా - పశువులకోసం పక్షులకోసం మనుష్యులకోసం। నదులు కంటున్న కలలు పొలాల్లో ఫలిస్తాయి। కవులు కంటున్న కలలు మనుష్యుల్లో ఫలిస్తాయి" (ఆధునిక మహాభారతము) నదిలా కవి అనేక దేశాల్లో అనేక భాషల్లో అనేక నాగరికతల్లో అనేక మానవీయ సుఖదుఃఖాల్లో పడి ప్రవహిస్తాడు. కవి ప్రయాణంలో భాష వెనకబడి పోతుంది.

భాష నాలుగయిదు వందల మైళ్ళకంటే ఎక్కువ దూరం పరుగెత్తలేదు. భాష పరుగెత్తి పరుగెత్తి ఎక్కడ కూలబడి పోతుందో ఆ సీమనుంచీ మరోభాషలేచి పరుగెత్తుతుంది. ఇది దూరం చేస్తున్న అద్భుత తంత్రం. అక్కడ్నించీ మరో మట్టి, మరో చెట్టు, మరోనది, మరో ఆకాశం, మరో పువ్వు, మరో పండు, మరో పక్షి, మరోపాట! అక్కడ్నించీ మనిషి సుఖదుఃఖాలు, మనిషి కథలు, మనిషి కన్నీళ్ళు, మనిషి పురాణాలు, మనిషి చరిత్ర అన్నీ భిన్నంగా కనిపిస్తాయి. అంటే ఒకచోట మామిడిపండు ఉండి మరొక చోట లేదనీ ఒక చోట కోకిల ఉండి మరొక చోటలేదనీ ఒక చోట కన్నీరు ఉండి మరొక చోట లేదనీ కాదు దీని అర్థం. అన్నీ యథాతథంగానే ఉంటాయి కానీ వాటి రంగులో రుచిలో వాసనలో ఏదో అనిర్వచనీయమైన ఒక విశేషం ఉంటుంది. అర్థాత్ అది వస్తువుల్లో ఉన్న భిన్నతకాదు. అది వస్తువుల్లో ఉన్న విశేషం. 'అదంతా ఒక వేరే జీవితపు అగ్నిముద్ద. ఆ అగ్నిముద్దంతా మోసుకుని వస్తుంది, ఆ మట్టిలో పుట్టిన అలంకారం! ఆ అలంకారాన్ని ఆ అలంకార సంకేతిత సాహిత్యాన్ని మనం ఆర్జించుకుంటే ఆ ప్రజల జీవన సారాంశాన్ని మన జీవన సారాంశంలో మిళితం చేసుకున్నామన్న మాటే; ఇలా ఎన్ని సాహిత్యాల్ని మనం స్వాధీనం చేసుకుంటామో అన్ని మానవీయ అనుభూతి విశేషాల్ని నాగరికతల్నీ కాలాల్నీ దూరాల్నీ అవి మన స్వాధీనం చేస్తాయి. మన ఆత్మగతం చేస్తాయి; మన చైతన్య దిగంతాల్నీ విస్తృతం చేస్తాయి. ఒక అలంకారం ఇంత పని చేస్తుంది. కనకనే ప్రసిద్ధకవి విమర్శకుడు ఆర్చిబాల్డ్ మెక్లీషు అంటాడు," If a metaphor dies a whole civilization dies." "ఈ తాత్త్విక కాంతిలో తులనాత్మక సాహిత్యం అంటే ఏమిటో చూడాలి.

కాల దూరాల కరిష్మానుంచి మనిషి తప్పించుకోలేడు. ఒకే ఇంగ్లీషు భాష అట్లాంటిక్ మహాసముద్రంచేత రెండు భాషలయిందట! వ్యాలెస్ స్టీవెన్స్ అంటాడు," Americans are not British in Sensisbility nor are they European" కాలదూరాలను జయించడానికి తులనాత్మక సాహిత్యం అమోఘమైన అస్త్రం. తులనాత్మక సాహిత్యం అంటే కంపారెటివ్

# ప్రాచీన గ్రీకు ప్రాచీన భారతీయ నాటకాల తులనాత్మక పరిశీలన

(విశేషించి డిథిరాంబ్, పూర్వరంగాల్ని స్పృశిస్తూ)

ఒలింపస్ పర్వతం గ్రీకుదేవతల నివాసమైతే, గ్రీసుదేశం గ్రీకు సాహిత్య దేవతల ఒలింపస్ పర్వతము. సుమారు క్రీ.పూ. 10వ శతాబద్దంనుంచి (అంటే హోమర్ నుంచి) క్రీ.పూ. 3వ శతాబ్దంలో మీనాండర్ వరకు గ్రీసులో మనకు ఒక ఉజ్జ్వల కవుల పరంపర కనిపిస్తుంది. ఈ కవి పరంపర గ్రీకు ప్రజల్ని వీరగాధా కవులుగా, వీధి గాయకులుగా ఐతిహాసిక ఛందస్సుల్లో రాసిన వీరకావ్య ప్రధాన గీతాలతోను, జీవనం, ప్రేమ అనే మధువు తొణికిసలాడే శిల్పిత పద్య రచనలతో ప్రణయగాయకులుగాను ఆనంద జలధిలో ఓలలాడించారు. మానవజాతికి తెలిసిన అత్యంత ప్రాచీన కావ్యాల్లో ఒకటైన ఇలియడ్‌ను గురించి, అది మానవ అధరాలమీద నినదించిన మహోన్నత కావ్యమనే విఖ్యాతి ఉంది.

హోమర్, హీసియడ్, సాఫో, పిండార్‌ల తర్వాత విషాద నాటక మహాకవులైన ఎస్కిలోస్, సోఫోక్లిస్, ఎవ్రిపిడోస్ ఆ తర్వాత అరిస్టోఫెనీస్ అలాగే మినాండర్ వరకు ఎందరో ఒక మహా సమూహం. అది ఒక బ్రహ్మాండమైన తారామండలం. వారంతా ఈ భూమిమీద ఒక అజరామర నాగరికతను అంకురింపజేశారు. ఆ నాగరికతే తర్వాత యూరోపియన్ నాగరికత అనే మహత్తర వాస్తుశిల్పానికి ఆధార శిల అయింది. ఈనాటికీ గ్రీసు, సమస్త యూరోపియన్‌ల, తదుత్పన్న దూర దూర జాతీయ శాఖల, శరీర రక్త వాహినిల్లో ప్రవహిస్తోంది.

ఇంగ్లీషు కవి టి.యస్. ఇలియట్ "యూరోపియన్ మనసు" అన్నప్పుడు ఫ్రెంచి పాల్ హెజార్డ్ "యూరోపియన్ అంతరాత్మ" అన్నప్పుడు, లేక ఇంగ్లీషు సాహిత్య విమర్శకుడు మాచ్యూ ఆర్నాల్డ్ "సాహిత్య విమర్శ, భావత్మాకంగాను, సంవేదనాత్మకంగాను యూరప్ ఖండాన్ని ఒక మహా బౌద్ధిక ఆధ్యాత్మిక సమితిగా భావించాలి" అన్నప్పుడు మనకు ప్రాచీన గ్రీకు నాగరికత ప్రతిధ్వనే వీరి మాటల్లో వినిపిస్తుంది. ఆకాశం క్రింద అశేష ప్రజానీకం దగ్గరికి తమ కళని తీసుకెళ్ళే కవులే నాగరికతల్ని చేశారు. ఇతిహాస గాయక కవి, రంగస్థల ఇంద్రజాల కవి, తమ ప్రేక్షక శ్రోతల హృదయాల్లో పరిణామబీజాల్ని అజ్ఞాతంగా చల్లారు; చల్లి వాళ్ళు ఇంటికి వెడుతూ వెడుతూ ఒక అంతఃపరివర్తనకి గుర్రై కొత్త మనుషులుగా మారి ఇల్లు చేరేలా చేశారు. ఆ ప్రాచీన కాలంలో హోమర్ తదితర గ్రీకు నాటక కవులు తమ ప్రజలకు చేసింది ఇదే. హోమర్ తర్వాత ముఖ్యంగా క్రీ.పూ. 6వ శతాబ్ది, గ్రీకు నాటకానికి పునాదులు వేసిన సువర్ణ శతాబ్దం. గ్రీకు విషాద నాటకం సమస్త గ్రీకు సాహిత్యానికి అంతస్సారం. అది గ్రీకు దేవతలకు చేసే అభినయపూర్వక పూజా కలాపంలోనుంచి పుట్టింది; అందులోనూ ముఖ్యంగా పెలిపోన్నెసస్, ఏట్టికా అనే నగరాల్లో జరిపే గ్రీకు దేవత డయానిసస్

# శాకుంతలం నాందీ శ్లోకము దేవీ స్తోత్రమే

జగత్ప్రసిద్ధమగు అభిజ్ఞానశాకుంతలమున గల నాందీశ్లోకమును ఇంతవరకు కేవలము ఈశ్వరస్తోత్రముగనే భావించుచున్నారు. కాని దానిలో మంత్రశాస్త్రార్థ ప్రతీతి గలదు! కవి కాళీవరప్రసాద లబ్ధకవితాధౌరేయుడని గదా ప్రశస్తి. ఈ శ్లోకమును కవి మాతృకాస్తోత్రమును చేసెను. ఆ చిత్రమైన ఉదంతమును వివరింతును:

'యా సృష్టి స్స్రష్టురాద్యా, వహతి విధిహుతం యా హవిర్యా చహోత్రీ,
యే ద్వే కాలం విధత్తః శ్రుతి విషయగణా యా స్థితా వ్యాప్య విశ్వం,
యా మాహుః సర్వభూతప్రకృతి రితి, యయా ప్రాణినః ప్రాణవంతః,
ప్రత్యక్షాభిః ప్రపన్నస్తనుభి రవతు వ స్తా భి రష్టాభి రీశః

అర్థము: ఎవతె స్రష్టయొక్క ఆద్య సృష్టియో, ఎవతె విధిహుతయైన హవిస్సును వహించునో, ఎవతె హోత్రియో, ఎవతెలిద్దరు కాలమును విధింతురో, ఎవతె శ్రుతివిషయ గుణయో, ఎవతె విశ్వమును వ్యాపించియుండునో, ఎవతెను సర్వభూతప్రకృతి యందురో, ఎవతె చేత ప్రాణులు ప్రాణివంతములగునో – ఆ ఎనిమిది ప్రత్యక్ష తనువుల చేత ప్రపన్నుడైన ఈశుడు మిమ్ములను రక్షించుగాత – ఇదీ శ్లోకము.

కనుక బాహిరముగా కనుపించుచుండుట చేత ఇప్పుడు చెప్పబడుచున్న అర్థము – అష్ట తనువుల చేత ప్రపన్నుడై ఈశుడు మిమ్ములను రక్షించుగాత అని. అష్టతనువు లేవి?– "జలం వహ్నిస్తథా యష్టా. సూర్యచంద్రమసౌ తథా. ఆకాశం వాయురవనీ మూర్త యోష్టా పినాకినః" జలవహ్నియష్ట సూర్యచంద్ర ఆకాశ వాయు అవని అను ఎనిమిది మూర్తులు గలవాడు అష్టమూర్తి – ఈశ్వరుడు. మన శ్లోకమునందు "యా సృష్టిః స్రష్టురాద్యా" అనగా జలము, "యా విధిహుతం హవి ర్వహతి అనగా వహ్ని. "యాచ హోత్రీ" అనగా యజమానుడు. "యే ద్వే కాలం విధత్తః" అనగా సూర్యచంద్రులు, "శ్రుతి విషయగుణా యాస్థితా వ్యాప్య విశ్వం" అనగా ఆకాశము, "యా మాహుః సర్వభూతప్రకృతి రితి" అనగా అవని. "యయా ప్రాణవంతః" అనగా వాయువు – ఈ ఎనిమిది ఈశ్వరుని మూర్తులు గనక – ఆయన అష్టమూర్తి, అయితే శ్లోకమున 'యా, యే' యామ్. యయా (ఎవతె) అని స్త్రీలింగమెందుకు వాడబడినది? 'తాభిరష్టాభి స్తనుభిః ప్రపన్నః ఈశః అవతువః – ఇందు తనుః అను శబ్దము సంస్కృతమున స్త్రీలింగము. కనుక ఒక్కొక్క తనువును గూర్చి చెప్పునప్పుడు, 'యా, యే, యామ్, యయా' అని స్త్రీలింగ సర్వనామము, వాడబడినది (ఎవతె, ఎవతెలిద్దరు, ఎవతెను, ఎవతెచేత – అట్టి తనువులు) అని సమాధానము.

కానీ ఇందు ఎన్ని విపర్యయములున్నవో పరిశీలించిన గోచరించును. అష్టమూర్తులు పైన చెప్పిన 'జలం వహ్ని' శ్లోకమునందలి క్రమముతో చెప్పబడినవని చెప్పుదురు. ఆప్టే

# ఇద్దరు ఋషులు ఒక కవి

(కాళిదాసు సృజనాతంత్రముః భారతీయ సాహిత్యం మీద ఆయన ప్రభావం – ఒక పరిశీలన)

నదులు దేశాన్ని సాగు చేస్తే కవులు ప్రజల్ని సాగు చేస్తారు. కవులు మానవజాతి రక్తకణాల మీద పనిచేసే అలంకారాల నదులు. సింధు, గంగ, భారతీయ సాంస్కృతిక కేంద్రాలైతే, వాల్మీకి, వ్యాసులు భారతీయ సాంస్కృతిక మూలస్థానాలు. భారతీయ జీవనంలో గురుత్వాకర్షణ కేంద్రం సింధూనది నుంచి గంగానదికి మారిపోయిన తర్వాత, అంటే వైదికయుగం అంతమయిన తర్వాత ఇతిహాసపు నవీనయుగం మహర్షి వాల్మీకి చేత రామాయణంతో ఉద్ఘాటితమయింది. రామాయణంలో సింధునది గురించి ప్రసక్తి కనిపించదు. కాని గంగ అనేక పర్యాయములు ప్రసక్తమైంది. ఆనాటి భారతీయ పవిత్ర నదుల్లో 'గంగ' అత్యున్నత స్థానాన్ని ఇది సూచిస్తుంది. "దదర్శ రాఘవో గంగాం పుణ్యాం ఋషి నిషేవితాం,' ' "సముద్ర మహిషీం గంగాం సారసక్రౌంచ నాదితాం," రామాయణంలో కనిపించే భారతీయ సంస్కృతిని భవిష్యత్తులోకి దీర్ఘీకరిస్తూ వ్యాసమహర్షి వాల్మీకి పదచిహ్నాలను అనుసరించినాడు. వాల్మీకి కావ్యతంత్రాన్ని, కావ్యవస్తువును, నిర్మాణ సామగ్రిని, భాషను తన కావ్యసృజనా ప్రక్రియకు వాడుకున్నాడు.

అదే మార్గంలో వ్యాసుడ్ని కాళిదాసు అనుసరించాడు. సమగ్ర కాళిదాస వాఙ్మయ దర్శనం చేస్తే సంస్కృతి, కళ, భాష, ఆది మూల భూత విషయాలతో కాళిదాసు నిస్సందేహంగా వ్యాస వాల్మీకుల సమ్మేళనం అనిపిస్తాడు. సరళత, సూక్ష్మత, ఉదాత్తత, మానవీయ సంవేదన శీలతతో ఆర్ద్రమై ఈ ముగ్గురు కవుల కళలో మూలద్రవ్యాలుగా కనిపిస్తాయి. వాస్తవంగా చూస్తే ఈ ఇద్దరు ఋషులూ కాళిదాసూ భారతీయ సాహిత్య త్రిమూర్తులు. ఈ ముగ్గురికి మధ్య ఉన్న అతి దీర్ఘకాలం ఎందరో కవుల్నీ, ఎంతో అనంత సాహిత్యాన్నీ కబళించింది. కానీ ఈ ముగ్గురిని మాత్రమే విడిచి పెట్టింది. ఇది ఎంతో ఆశ్చర్యకరమో అర్థం చేసుకోవాలి. కబళిత కవుల్లో ఘటనాఘటన సమర్థులు ఎందరో ఉండే ఉంటారు. కాని వాళ్ళ కీర్తి, వాళ్ల ప్రజ్ఞ కాలం ముఖం నుంచి వాళ్ళను రక్షించ లేకపోయింది.

ఇద్దరు ఋషులూ దేశానికి వారసత్వంగా ఇచ్చిపోయిన సాహిత్య సంస్కృతికి కాళిదాసు చివరి కాపలదారు, అని భారతీయ సాహిత్య చరిత్ర మనకు చూపిస్తుంది. ఆయన తర్వాత ఆ సంస్కృతి క్రమంగా పతనమైపోయింది. మళ్లీ కోలుకోలేదు. కాళిదాసుతో మనం సంస్కృత సాహిత్యాన్ని రెండుగా విభజించి విశ్లేషణాత్మక పరిశీలనకు గురిచేస్తే కాళిదాసానంతర యుగంలో ప్రవాహమాన భాషగా ఉన్న సంస్కృతం జడత్వం పొందడం, ఆ భాషలో అతి మాత్రగా కృత్రిమత్వం, నిరర్థక పాండిత్య ప్రకర్ష ప్రవేశించడం, ఆధిపత్యం వహించడం కనుపిస్తుంది; ఫలితంగా ఈ మార్పులు పరాక్రమశాలి అయిన సంస్కృత సాహిత్యవాహినిని

# విప్లవ కవిత్వము : సాహిత్యవిమర్శ

సాహిత్యవిమర్శ సాహిత్యాన్ని గురించా లేక సాహిత్య కర్తను గురించా అనే ప్రశ్న సాహిత్య విమర్శలో ద్వారం దగ్గరే ఎదురయ్యే ప్రశ్న. దానికి హేతుబద్ధమైన సమాధానం ఇవ్వలేనివాడు సాహిత్యవిమర్శలోకి ప్రవేశించే యోగ్యత లేనివాడు–

సాహిత్యకర్త వట్టి మనిషి: వాడు సాహిత్య గర్భధారి మనిషికావచ్చు. కానీ పఠిత ఆస్వాదించడం అక్షరరూపంగా లేక శబ్దరూపంగా ఉన్న సాహిత్యాన్నే: సాహిత్యకర్త అయిన మనిషినికాదు. సాహిత్య గర్భధారి మనిషి అసాధారణ మనిషి కావచ్చు, కానీ అతని గర్భం నుంచి శిశువు ఉదయించినప్పుడే అతడు సాహిత్యకర్త అనిపించుకోగలడు లేకపోతే అతడు సాహిత్య గర్భధారి అని తెలుసుకునే సాక్ష్యం కూడా లేదు. అలాంటివాడు సాహిత్యవిమర్శకు విషయంకాజాలడు. పఠిత సాహిత్యాన్ని ఆస్వాదిస్తూ తల్లీనుడైపోతున్నప్పుడు తత్కావ్యతలో మునిగి ఈతకొడుతూ దాన్నే అనుభవిస్తున్నాడు: ఆ అలంకారాల్నీ, వాటిని మోసే భాషా విలాసాల్నీ, జలాల్లో బింబాల్లా అలంకారాల్లో గోచరించే లీలామయకావ్యవస్తువునీ అనుభవిస్తున్నాడు. అసలు సాహిత్య ప్రయోజనము పఠితపొందే ఈ అనుభవమే. ఈ అనుభవమే పఠితమీద పడుతున్న ప్రభావము, చప్పుడు చెయ్యకుండా నదీ కూలాన్ని కోశే ప్రవాహంలాంటిది ఆ ప్రభావము. అప్పుడు పఠిత మనస్తత్వంలో పఠిత లోకాన్ని చూచే భంగిమలో క్రమపరిణామం వస్తుంది. అదే కావ్యం తెచ్చేమార్పు – ఈ ఇంద్రజాలాన్ని చేస్తున్నది అలంకారము, పఠిత పుస్తకాన్ని చదివి ఈ అవస్థకు గురి అవుతున్నాడు. పఠిత యొక్క ఈ అనుభూతికి లేక పై ప్రభావానికి పుస్తక కర్త అయిన మనిషి హేతువుకాదు, పుస్తకమేహేతువు... ఆమనిషి ఫలానా గ్రామంలో పుట్టాడు, అతడు బీదవాడు అతడు స్ఫురద్రూపి లేక దొంగవెధవ, ఫలానా నౌకరీ చేస్తున్నాడు, ఫలానాచోట చదువుకున్నాడు, ఫలానా జీవన సంఘటనలకు లోనయ్యాడు, అతడు బక్క పలచటివాడు లేక బడుద్దాయి ఇత్యాది వర్ణనలు వివరాలు పుస్తకం వాడి చేతిలో పుట్టడానికీ, దోహదకారిహేతువులు కావచ్చు, కానీ, ఆ వివరాల జ్ఞానం అలంకారం భాషావస్తు రూప కావ్యత నుంచి పఠిత పొందే అనుభవాన్ని మార్చలేవు చేర్చలేవు, ఓహెన్రీ బ్యాంకు నౌకరీ చేస్తూ ద్రవ్యాపహరణ అభియోగానికి గురి అయ్యాడు, వాల్మీకి కిరాతుడు, వ్యాసుడు అవివాహిత స్త్రీపుత్రుడు ఇలా ఎన్నో ఉదంతాలున్నాయి రచయితల జీవితాల్ని గురించి, అవి వాళ్ళ రచన ముఖాన అదృష్టరేఖలు గీయలేదు తుడపలేదు. ఇది లోకానుభవ సిద్ధమైన విషయము. కనక ఫలస్వరూపంగా సిద్ధాంతమేమిటంటే, సాహిత్య విమర్శకు విషయం పుస్తకమేగాని పుస్తకకర్తకాదు.

కావ్యవిమర్శ కావ్యాన్ని ఆస్వాదించడమే గానీ వాదించడంకాదు. కవి మాట్లాడడు, కావ్యమే మాట్లాడుతుంది. ఈ వాదించే లక్షణమున్నవాడు కవిమాట్లాడుతాడనేభ్రమతో ఆ అకృత్యానికి పాల్పడతాడు. కావ్యవిమర్శ ఒక సంస్కృతి ఒక సర్టిఫికేట్ కాదు. విమర్శకుడు కావ్యాన్ని

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Kalarekha+Ee+Satabdi+Chintana**

* * *